క్లుప్తంగా

దేవమ్మగుడికి రూ.25వేలు విరాళం



నగదు అందజేస్తున్న నాగరాజ్‌గౌడ్

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన దేవమ్మగుడి అభివృద్ధికి ఉరుకుంద ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ నాగరాజ్‌గౌడ్ రూ.25వేల విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు నగదును గురువారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి తన వంతుగా ఎల్లప్పుడు సహకారం అందిస్తామన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాఘన్న

మంత్రాలయం రూరల్ : 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన పాఠ్య పుస్తకాలను ఎంఈఓ రాఘన్న పంపిణీ చేశారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంత్రాలయం, చెట్నహళ్లి, సూగూరు, కేజీబీవీ చిలకడోణ పాఠశాలల హెచ్‌ఎంలకు పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు మొదటి విడతగా 31,574 పాఠ్యపుస్తకాలు, 59,638 నోట్ బుక్స్ వచ్చినట్లు వివరించారు. అలాగే ఇంకా 20,000 పాఠ్య పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు హంపయ్య, లచ్చప్ప, రాఘవన్‌గురురాజ్, సరళదేవి, పీఈటీ రవీంద్ర, సీఆర్పీ నరసన్నగౌడ్ పాల్గొన్నారు.

రథోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోండి



రథాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ హనుమంత రెడ్డి

కోసిగి: ఈనెల 12వ తేదీన కోసిగిలో జరుగబోయే కోసిగయ్య (ఆంజనేయ) స్వామి మహా రథోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ హనుమంత రెడ్డి సూచించారు. గురువారం కోసిగిలో రథోత్సవం నిర్వహించే తేరుబజారు మైదానం పరిసరాలను స్థానికులతో కలిసి పరిశీలించారు. తేరుబజారులో ఉండే వ్యాపార దుకాణదారులు రథోత్సవం ముగిసే వరకు వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారం మైదానం పరిసరాల్లో పడేయ కుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రథోత్సవం రోజున ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంతం జరుపుకోవాలని సూచించారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న గ్రామ పెద్దలు

నందవరం : గ్రామ దేవర సందర్భంగా మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ఇందులో బీవీ యూత్ జట్టు విజేతగా నిలిచింది. అలాగే కిడ్స్ లెవన్ జట్టు రన్నర్‌గా నిలించింది. ఇరు జట్లకు గ్రామ పెద్దలు ట్రోఫీలు, మెమోంటోలు, సీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిశోర్, రాజేష్, తిమ్మప్ప, శ్రీనివాసులు, వీరేష్, రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



సుధాకర్‌బాబు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూస్మారక పురపాలక ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సుధాకర్‌బాబు డాక్టరేట్ పొందారు. ఈయన మనో విజ్ఞాన శాస్త్ర విభాగం తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారిచే డాక్టరేట్‌ను అందున్నారు. ప్రొఫెసర్ ఎల్.కుళ్లాయిరెడ్డి పర్యవేక్షణలో ×ఉన్నత పాఠశాలల విద్యార్థుల సాధన ప్రేరణపై అభిజ్ఞానశైలులు మరియు స్వీయ సామర్థ్యాల ప్రభావం× అనే అంశంపై చేసిన పరిశోధనకు యూనివర్సిటీ వారు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం హలీంసిద్ధికీ, పాఠశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

డీఏ బకాయిలు చెల్లించాలి

ఆదోని సెంట్రల్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులకు కరువుభత్య బకాయిలు చెల్లించకుండా ఆదాయ పన్ను మినహాయించడం ఉద్యోగుల దౌర్భాగ్యమని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్ జి.వీరచంద్రయాదవ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆదాయపు పన్ను చెల్లించిన 60 నెలల కరువు భత్యం బకాయిలు, 2023 గ్రీన్ ఛానళ్లలో ఉన్న 34 నెలల బకాయిలు చెల్లింపు ఊసే లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

మతసామరస్యానికి ప్రతీక

- పరమేశ్వరుడిని మెప్పించిన మహనీయుడు ఖాదర్‌లింగస్వామి
- మానవుల్లో మత మౌఢ్యాన్ని తొలగించేందుకు కౌతాళానికి రాక
- 321 ఏళ్ల క్రితం గ్రామంలో సమాధి
- నేటి నుంచి స్వామి ఉరుసు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ధర్మకర్త



విద్యుద్దీపాలంకరణలో దర్గా ముఖద్వారం, (ఇన్‌సెట్) దర్గా ధర్మకర్త మున్నపాషా

కౌతాళం: మానవుడు పూజిస్తున్న భగవంతుడు ఏ ఒక్క మతానికి చెందినట్లు కాదని, మతం అనేది మనిషి మనిషికి మధ్యనే కానీ మనసుకు కాదని నిరూపించిన మహనీయుడు శ్రీజగద్గురు ఖాదర్‌లింగ స్వామి. ఆయన చరాచర జీవకోటి రాశులకే మూలమైన పరమేశ్వరుడినే మెప్పించిన ఓ ముస్లిం మహనీయుడు అని చరిత్ర చెబుతోంది. మండల కేంద్రమైన కౌతాళంలో ప్రతి ఏటా హిందూ, ముస్లింలు ఐక్యతగా స్వామివారి ఉరుసు నిర్వహిస్తున్నారు. నేటి నుంచి స్వామి వారు 321వ ఉరుసు వైభవంగా జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేడు గుసుల్ కార్యక్రమం

శుక్రవారం సమాధికి సుగంధ ద్రవ్యాలతో శుభ్రం (గుసుల్) చేస్తారు. శనివారం గంధం కార్యక్రమం, ఆదివారం ఉరుసు ఉత్సవం, సోమవారం సఫ్రా (ప్రసాదం పంపిణీ), మంగళవారం జియారత్ వేడుకలు ఉంటాయని దర్గా దర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చీష్తీ తెలిపారు. స్వామిని శ్రీజగద్గురు మహాపురుష సయ్యద్–షా–ఖాదర్‌లింగస్వామిగా ఈ ప్రాంతవాసులతో నిత్యం కొనియాడబడుతున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఖాదర్‌లింగ, లింగ్‌బంద్, జగద్గురు ఖాదర్‌లింగస్వామి, ఖాదర్‌వలిగా పేరుగాంచారు.

స్వామి వారి చరిత్ర

పూర్వం కర్ణాటక రాష్ట్రంలోని బీజాపూర్ పట్టణంలో కొలువైన అమీనుద్దీన్ అలిఆలా షేర్ ఏ ఖుదా గురువు గారి వద్ద ఖాదర్‌లింగ స్వామి 12 సంవత్సరాలు శిష్యరికం చేశారు. గురువు ఆజ్ఞానుసారం మానవుల్లో మత మౌఢ్యాన్ని తొలగించి మతసామరాస్యాన్ని చాటేందుకు కర్ణాటక సరిహద్దులో ఉన్న కౌతాళానికి వచ్చారు. ఆయన మెడలో లింగాన్ని ధరించేవారు. దీనికి ఈ ప్రాంతంలో ఉన్న శైవమతస్తులు కొందరు అభ్యంతరం చెప్పారు. భగవంతుడు ఎవరి సొంతం కాదని పరమేశ్వరుని ప్రతీక అయిన లింగంపై ఎవరికీ హక్కు లేదని ఆయన వారితో వాదించారు. ఒకరోజు శైవమతస్తులను సమావేశ పరిచి వారి మెడలో ఉన్న లింగాలను బావిలో వేసి, వాటిని మరలా రప్పిస్తానని, అలా చేయలేని పక్షంలో గ్రామం వదలి వెళ్లడానికి సిద్ధమని, సాధించినచో తాను ప్రస్తుతం ఉన్న స్థలాన్ని శ్వాశతంగా ఉండడానికి ఇచ్చేయాలని ఒప్పందానికి వచ్చారు. ఈ ప్రయత్నంలో ఆయన శివున్ని మెప్పించి లింగాలను బావినుంచి రప్పించారు. అప్పటి నుంచి గ్రామస్తులంతా మత సామరస్యంతో ఆయనను ఖాదర్‌లింగ స్వామిగా పూజించడం ఆరంభించారు. ఆయనకు ముగ్గురు భార్యలు ఐదుగురు కుమారులు 321సంవత్సరాల క్రితం ఆయన గ్రామస్తులు ఇచ్చిన స్థలంలోనే సమాధి అయ్యారు. ఆయన వంశస్తులు అయిన ప్రస్తుత ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ట్రస్టీగా ఉన్నారు.



60అడుగుల దర్గా గోపురం



ఖాదర్‌లింగ స్వామి సమాధి

ఉరుసు ఏర్పాట్లు

ఉరుసు మహోత్సవాలలో పాల్గొనే భక్తులకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్గా ధర్మకర్త మున్నపాషా తెలిపారు. మనరాష్ట్రం నుంచే కాకుండా మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, జమ్ముకశ్మీరు తదితర రాష్ట్రాల నుంచి భక్తుల తరలివస్తారన్నను. ఈసందర్భంగా హైదరాబాదుకు చెందిన కళాకారులతో ఖవ్వాలి పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దర్గాలో ప్రత్యేక అలంకరణ

దర్గా గోపురం 60అడుగులతో ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. దీని లోపలి భాగంలో నూతనంగా గ్లాస్ ఫిట్టింగ్‌తో వివిధ రంగులతో ప్రత్యేక హాదిసు ఆయాత్‌లు (ఉర్దూలో) గ్లాసుల్లో అమర్చారు. ఈ పనులను 25లక్షలతో హుబ్బళ్లికి చెందిన భక్తులు పూర్తి చేశారని ధర్మకర్త తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



గోనెగండ్లలో కేజీబీవీ సమీపంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ టి. చిరంజీవి

గోనెగండ్ల : గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ టి. చిరంజీవి సూచించారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల సమీపంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలో ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయని, వాటిలో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వ హయంలో 1,176 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇందులో 443ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని,. మిగతావి వివిధ స్టేజ్‌లలో ఉన్నాయని తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు రూ. 1.80లక్షలు బిల్లు వచ్చేది. అయితే ఇప్పుడు ఆ బిల్లుతో పాటు బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనంగా మంజూరు అవుతుందన్నారు. ఇప్పటికే 139 మంది లబ్ధిదారులకు అదనపు బిల్లు మంజూరైందని చెప్పారు. జూన్ 12వ తేదీ నాడు గృహ ప్రవేశాలు జరిగేలాగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీఓ మణి మంజరి, హౌసింగ్ ఏఈ షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం



భక్తుల మధ్య ముందుకు సాగుతున్న రథం

ఆదోని రూరల్: మండలంలోని పెసలబండ గ్రామంలో గురువారం సాయంత్రం జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం భక్తుల మధ్య వైభవంగా సాగింది. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథాన్ని ముందుకు లాగారు.

వీరంపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

గోనెగండ్ల: మండల పరిధిలోని వీరంపల్లి గ్రామంలో గురువారం వీరబ్రహ్మేంద్రస్వామి 29వ తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం గ్రామోత్సవం, స్వామివారి దంపతుల కళ్యాణం, సాయంత్రం రథోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తిరుణాల సందర్భంగా గ్రామంలో పరుగు పందెం, బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సంజీవయ్యస్వామి పరుగు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: మండలంలో వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలు విస్తృతంగా పర్యటించి పలు శుభకార్యక్రమాలకు హాజరయ్యారు. గురువారం మండలంలోని డి. బెళగల్, పల్లెపాడు, చింతకుంట, కోసిగిలోని పై మారెమ్మవ్వ దేవాలయం, జగనన్న కాలనీలోని జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలలో జరిగిన వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన వధువరూలను ఆశీర్వదించారు. కోసిగిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త బసిరెడ్డి కొత్త ఏర్పాటు చేసిన వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణం, కాంట్రాక్టర్ నాగరాజు గృహ ప్రవేశావు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన వెంట ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, బీసీ సెల్ నియోజవర్గ అధ్యక్షుడు నాడుగేని నాగరాజు, మండల ఉపాధ్యక్షులు ముకుంద కృష్ణమూర్తి, మండల కార్యదర్శిలు బుళ్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రైల్వే కాంట్రాక్టర్ నరసింహులను ఎమ్యెల్యే వై. బాలనాగి రెడ్డి పరామర్శించారు. ఆయన కొద్ది కాలంగా తల భాగంలో రక్తం గడ్డకట్టడంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నారు. ఆపరేషన్ చేయించుకుని ఇంటికి చేరడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.

గుడిసె దగ్ధం

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామ సమీపంలోని పొలాల మధ్యలో ఉన్న తిప్పన్న తాత మఠానికి చెందిన గుడిసెకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని దగ్ధమైంది. గురువారం సాయంత్రం పక్కన ఉన్న పొలంలో ఎవరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మంటలు చెలరేగి పక్కనే ఉన్న గుడిసె అంటుకున్నాయి. స్థానికులు గమనించి మంటలు ఆర్పేలోగా పూర్తిగా కాలిపోయింది. మఠానికి సంబదించిన వంట సామగ్రి, వస్తువులు కాలిపోయి రూ.50వేలు నష్టం వాటిలిందని మఠం నిర్వాహకులు తెలిపారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలోని వార్డ్ సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సచివాలయంలో పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సచివాలయ సెక్రటరీకి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ప్రజలు అందించే సేవల పట్ల నిర్లక్ష్యంగా వుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి అస్లాం బాష తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నాగరాజులు డిమాండ్ చేశారు. ఈనెల 20 నుంచి మూడు రోజుల పాటు కార్మికులు చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆదోని టౌన్: వేసవికాలం దృష్ట్యా ఆదోని డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కోసిగి మండలంలో పల్లెపాడు, ఆస్పరి మండలంలో అట్టేకల్, ఆదోని మండలంలో అలసందగుత్తి, సాంబగల్, గొనెగండ్ల మండలంలో కున్నూరు గ్రామాల్లో నీటి సమస్య ఎక్కువగా ఉందని చెప్పారు. బోర్లను అద్దెకు తీసుకుని పైపులైన్లను ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఆస్పరి మండలం జొహరాపురం, కారుమంచి, దేవనకొండ మండలంలో మాచాపురం గ్రామాల్లో నీటి సమస్య దృష్ట్యా వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆదోని డివిజన్‌లో 26 సీపీడబ్ల్యూఎస్ స్కీంలు ఉన్నాయని, అయితే మొత్తంగా 9 గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. రైతుల దగ్గర నుంచి బోర్లను అద్దెకు తీసుకొని నీటిని సరఫరా చేస్తామని, బోర్లు లేని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తామన్నారు.

టెక్స్‌టైల్ పార్క్ పేరుతో చేనేతలను మోసం చేయకండి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు భూమి పూజ అంటూ చేనేతలను మభ్యపెట్టకుండా నిర్మాణాన్ని పూర్తి చేసి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చేనేతలను ఆదుకోవాలన్న తలంపుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి మగ్గం వున్న ప్రతి నేత కార్మికుడికి ఏటా రూ.24వేలు ఆర్థిక సహాయం అందించిందన్నారు. దీంతో నేతలు ముడిసరుకు కొనుగోలుకు వస్త్ర తయారీకి ఎంతో ఉపయోగపడిందన్నారు. అదేవిధంగా చేనేతలకు ప్రతి నెల 100 యునిట్ల ఉచిత విద్యుత్ అందించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు 200ల యునిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిందే కాని 11 నెలలైనా నేటికి అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. కాగా బనవాసి వద్ద 77 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రులు భూమి పూజ చేశారే కాని ఇందుకు నిధుల కేటాయింపు, చేనేతలకు ఏవిధంగా ఉపాధి చూపుతారో, ముడిసరుకు ఇస్తారా, యువతకు ఏమైనా శిక్షణ ఇస్తారా, ఇందుకై ఏమైనా చేనేతలను ఎంపిక చేశారా అన్న అంశాలేవి ప్రకటించలేదన్నారు.

గతంలో రెండు సార్లు శిలాఫలకాలు..

గతంలో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వం రెండు సార్లు శిలాఫలకాలు వేసి భూమి పూజలు చేసిందని అయితే అక్కడ ఒక్క కట్టడం కూడా చేయలేకపోయిందని విమర్శించారు. మళ్లీ ఇప్పుడు మూడు రోజుల క్రితం శిలాఫలకం, భూమి పూజ చేశారని అయితే ఆ శిలాఫలకం కూడా తీసేయడం పట్ల అనుమానాలు వ్యక్తమతున్నాయన్నారు. కాగా ప్రస్తుతం ఏర్పాటు చేస్తామన్న టెక్స్‌టైల్ పార్క్‌ను ప్రభుత్వమే నిర్వహిస్తుందా లేక ఎమ్మెల్యే వెంట వున్న మాస్టర్ వీవర్స్‌కే అప్పజెబుతారా అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. మాస్టర్ వీవర్స్ చేనేతలతో నేతపని చేయించుకొని వారికి ఇచ్చే కూలీలు కూడా సరిగా ఇవ్వక పోతుండటంతో నేటికి ఆయా నేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హెచ్.మురవణి వద్ద చేనేతలకు ఇచ్చిన ఇంటి స్థలాల సమస్యలపై కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం తాలూకా అధ్యక్షుడు ఖాశింబేగ్, పార్టీ ఐటీ సెల్ అధ్యక్షుడు మాచాని సోమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కరె రాము, నాయకులు చంద్రశేఖర్, రఘువీర, రఘు, పామయ్య, నరసింహులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని బల్లేకల్ గ్రామంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి సైట్ ఓపెన్ చేస్తే దరఖాస్తు చేసుకుందామని వెళ్లిన ప్రజలకు అక్కడ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయన్నారు. సమయపాలన పాటించని సచివాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


రేపు శనిదోష పరిహార పూజలు

ఆదోని అర్బన్: శనిత్రయోదశి సందర్భంగా ఈనెల 10వ తేదీన శనివారం మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనిదోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ కొప్రేష్‌ఆచార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మంగరాయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం అర్ధాష్టమ, అష్టమ, ఏలినాటి శని, శనిదోషములతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలను అనుభవిస్తున్న మేష, మీన, కుంభ, ధనస్సు, వృశ్చిక, సింహ, కన్యరాశుల వారికి శనిదోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల శ్రీపాదులవారి ఆదేశాల మేరకు శనిదోష పరిహార పూజలు, శాంతిహోమం, తైలాభిషేకం చేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు సెల్ నం. 9110731103 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

షరాఫ్ బజార్‌లోకి నో ఎంట్రీ

ఆదోని అర్బన్: పట్టణంలో బంగారం దుకాణాల అంగళ్లు ఉన్న షరాఫ్‌బజార్ మెయిన్ ఎంట్రాన్స్ వద్ద నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు గురువారం తెలిపారు. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఆటోలు లోపలికి వెళ్లకుండా, లోపల ఉన్న వాహనాలు కూడా ఒక పక్కనే క్రమబద్ధీకరించి ప్రజలకు, టూవీలర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెండు పక్కల బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. షరాఫ్‌బజార్ మెయిన్ ఎంట్రాన్స్ దగ్గర విజిబుల్ పోలీసులో భాగంగా వాహనాల తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించినట్లు చెప్పారు.

36వ వార్డు కౌన్సిలర్‌కు సన్మానం



సందీప్‌రెడ్డికి శాలువా, పూలమాలలు వేసి సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదోని టౌన్: 36వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మహ్మద్‌గౌస్, వైస్ చైర్మన్ నరసింస్‌లు ఆధ్వర్యంలో సందీప్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అలాంటి వారి సేవలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి పదవులను కట్టబెడతారని చెప్పారు. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు తనకు ఈ స్థానం కల్పించిన అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి రుణపడి ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు ఫయాజ్‌అహ్మద్, అశోక్, ఉస్మాన్, చలపతి, వసీం, ఇంతియాజ్, మల్లేకర్ గోవిందరాజు, కిషోర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలు అప్రజాస్వామికం



సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆదోని జర్నలిస్టు సంఘం నాయకులు



ఎమ్మిగనూరులో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్ట్ సంఘ నాయకులు



కోసిగిలో ఆర్‌ఐ శ్రీరాములకు వినతి పత్రం అందజేస్తున్న కోసిగి మండల పాత్రికేయులు



కౌతాళంలో తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసంలో పోలీసులు గురువారం అక్రమంగా ప్రవేశించి సోదాలు నిర్వహించడం అప్రజాస్వామికమని ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, నాయకులు రామచంద్ర, నాగరాజు, మల్లికార్జున, సుంకన్న అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు రమేష్‌రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా కూటమి ప్రభుత్వం సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం శోచనీయమని స్థానిక జర్నలిస్ట్ సంఘ నాయకుడు దేవేంద్రమూర్తి అన్నారు. సాక్షిదినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై ప్రభుత్వం అనుసరించిన కక్షసాధింపు చర్యపై నిరసన వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక జర్నలిస్ట్‌లు నాగరాజునాయుడు, షబ్బీర్‌అహమ్మద్, ఉస్మాన్‌బాషా, అశోక్‌కుమార్, నరసింహారెడ్డి, సోహెల్ తదితరులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రగౌడ్‌కు వినతి పత్రం అదజేశారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

కోసిగి: పత్రిక స్వేచ్ఛను కాపాడాలని జాబ్ యూనియన్ నాయకులు వీరేష్, రామన్న, విజయ్‌కుమార్, గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో సోదాలను నిరసిస్తూ కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ శ్రీరాములను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఎడిటర్ ఇంట్లో సోదాలు అమానుషం

కౌతాళం: సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసు అధికారులు సోదాలు చేయడం అమానుషమని, ఇది ప్రతిక స్వేచ్ఛకు సంకెళ్లు అని ఏపీయూడబ్ల్యూజే నాయకులు అబ్దుల్‌షుకూర్, ఆచారి, ఆరీఫ్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలపారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డికి అందజేశారు. యూనియన్ నాయకులు ఖాజహుసేన్, ముక్తర్‌బాషా, ఆంజి ఇసాక్ పలువురు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: కార్మికులను నష్టపరిచే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈనెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని ఎన్‌డీఏ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, అధ్యక్షుడు వీరేష్, నాయకులు ఎల్లప్ప, నరసింహులు, నాగరాజు, రవి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.